క్లుప్తంగా

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా మంచి అలవాట్లతో ముందుకు సాగాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. శిబిరంలో విన్విజన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో కోశాధికారి కాజా రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు శ్రీకాంత్‌రెడ్డి, ఎం.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లలో నిలబడి నిరసన



మైలవరం: రోడ్డుపై నీరు నిలవకుండా డ్రెయినేజీ నిర్మించాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. చంద్రగూడెం మసీదు సెంటర్ వద్ద మోకాలి లోతు నీళ్లలో నిలబడి మంగళవారం నిరసన తెలిపారు. వజ్రాల వెంకటరెడ్డి మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి సైతం చంద్రగూడెం గ్రామంలోని మసీదు సెంటర్ వద్ద రహదారిపై నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజుల తరబడి వర్షం నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తులు సూరిబాబు, సదాశివరావు, బోలగాని రాజా, వి. నాగేశ్వరరావు, సంగు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ వద్దంటూ నిరసన



జి.కొండూరు: చెవుటూరు ప్రభుత్వ పాఠశాల పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి పిల్లల ప్రాణాలతో విద్యుత్ శాఖాధికారులు చెలగాటమాడుతున్నారని గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. పాఠశాల పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు పిల్లల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేసినా విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. గతంలో చందర్లపాడు మండల పరిధి అనాసాగరం ఉన్నత పాఠశాల విద్యార్థి పాఠశాల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా షాక్‌కు గురై మృతిచెందిన ఘటనను గుర్తు చేస్తూ నిరసన తెలిపారు. పనులు ఆపకపోతే తామే నిలువరిస్తామని హెచ్చరించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన



కృష్ణలంక(విజయవాడతూర్పు): జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా కృష్ణలంకలోని సత్యంగారి హోటల్ సెంటర్‌లో డాక్టర్ ఎన్ఆర్ఎస్ గవర్నమెంట్ ఆయుర్వేద కళాశాల, డాక్టర్ ఏఎల్ గవర్నమెంట్ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో డాక్టర్లు, పీజీ స్కాలర్లు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య సేవలు, సంప్రదింపులు, ఆయుర్వేద మందులు అందజేశారు. సుమారు 200 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ నల్లు ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

గుణదల(విజయవాడ తూర్పు): మహిళలకు అధునాతన డిజైన్స్ వస్త్రాభరణాలను అందించే దిశగా బుధవారం నుంచి రెండు రోజుల పాటు నగరంలో ప్రదర్శన, అమ్మకాలను నిర్వహిస్తున్నట్లు హైలైఫ్ ఎగ్జిబిషన్ సంస్థ ఆర్గనైజర్ డోమ్నిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ భారతీ నగర్‌లోని నోవోటెల్ హోటల్‌లో ఈ నెల 17,18 తేదీలలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో మహిళలు మెచ్చే అధునాతన డిజైనర్ శారీస్, నూతన ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రహదారి



పప్పుల మిల్లు సెంటర్ ఎర్రమట్టి రోడ్డులో అనధికారికంగా పార్కింగ్ చేసిన ప్రైవేటు వాహనాలు



గతంలో ఏర్పాటు చేసిన గడ్డర్‌లను తొలగించిన అధికార పార్టీ నాయకులు

ఊరు మనదే దోచెయ్...అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు అధికార పార్టీ నేతలు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి యథేచ్ఛగా పైసా వసూల్ చేస్తున్నారు. ఎర్రమట్టి రోడ్డులో అనధికారిక పార్కింగ్ ఏర్పాటు చేసి భారీ వాహనాలను అక్కడ పార్కింగ్ చేయించి ఇష్టం వచ్చినట్టు డబ్బులు వసూలు చేసి జేబులు నింపుకొంటున్నారు. అధికారులు కాని, పోలీసులు కాని పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

- అనధికారిక పార్కింగ్ నిర్వహిస్తున్న అధికార పార్టీ నేతలు
- వాహనాల చాటున మద్యం విక్రయాలు
- పట్టించుకోని అధికారులు
- బీఆర్టీఎస్ ఎర్రమట్టి రోడ్డు దుస్థితి ఇది...

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): ఎజ్జోనిపేట పప్పులమిల్లు సెంటర్‌లోని బీఆర్టీఎస్ ఎర్రమట్టి రోడ్డు ఆక్రమణలకు నిలయంగా మారింది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు రోజురోజుకీ పెరిగిపోవడంతో రహదారి కుంచించుకుపోయింది. కేదారేశ్వరపేటలో ఉన్న పండ్ల మార్కెట్‌కు నిత్యం వచ్చే భారీ వాహనాలతో పాటుగా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలను ఎర్రమట్టి రోడ్డులోనే నిలుపుతుండటంతో ఈ ప్రాంతం పార్కింగ్‌కు కేంద్రంగా మారింది. ఇక్కడ నుంచే సరుకును ఎగుమతులు, దిగుమతులు చేస్తుండటంతో తమకు రాత్రి, పగలు కునుకు లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు.

మద్యం మత్తులో గొడవలు

ఇక్కడ నిలిపే లారీలు, ట్రక్కులు, మినీ లారీలు, ప్రైవేటు బస్సుల చాటున కొందరు మద్యం, గంజాయి విక్రయిస్తున్నారు. వాటిని తీసుకున్న వారు మత్తులో చేసే గొడవలకు ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. వారు చేసే గొడవలకు మహిళలు, విద్యార్థులు ఈ మార్గంలో నడవలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పోలీసులు...

పగలు, రాత్రి తేడా లేకుండా ఇక్కడ బహిరంగంగా మద్యం తాగుతూ గొడవలు పడుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిఘా లేకపోవడంతో వారు మరింతగా రెచ్చిపోతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు, నగరపాలకసంస్థ అధికారులు చర్యలు తీసుకుని ఇక్కడ అనధికారిక పార్కింగ్‌ను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా వసూళ్లు...

స్థానికంగా ఉండే కొందరు చోటా నాయకులు వాహనాలను దగ్గర ఉండి పార్కింగ్ చేయిస్తూ వారి వద్ద నుంచి వందల రూపాయలు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతూ అనధికారిక పార్కింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇదే విధంగా అనధికారిక పార్కింగ్, వసూళ్లను నివారించేందుకు స్థానిక కార్పొరేటర్ బండి పుణ్యశీల వాహనాలు లోపలికి ప్రవేశించకుండా ఇనుప గడ్డర్‌లను ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన కొందరు చోటా నాయకులు గడ్డర్‌లను తొలగించి భారీ వాహనాలను యథేచ్ఛగా వచ్చేలా చేశారు.

ముస్లింలకు ఊరటనిచ్చిన సుప్రీం తీర్పు



మాట్లాడుతున్న గౌస్‌మొహిద్దీన్

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ సవరణ చట్టం విషయంలో తమకు జరుగుతున్న అన్యాయంపై ఆందోళన చెందుతున్న ముస్లిం మైనారిటీలకు మద్దతుగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి ఫలితంగానే సుప్రీకోర్టులో ముస్లింలకు ఊరటగా స్టే లభించిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు.వించిపేటలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ ఎంపీలు ఓటు వేయడమే కాకుండా అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేసి మైనార్టీల పక్షాన పోరాడిన ఫలితంగానే కీలకమైన ఐదు సవరణలపై కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలు వక్ఫ్ సవరణ చట్టానికి మద్దతుగా ఓటు వేశారని గుర్తు చేశారు. ముస్లింలకు అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల క్షేమమే ప్రధాన ధ్యేయం



వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల క్షేమమే ప్రథమ ధ్యేయమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఆయన చీఫ్ ఇంజినీర్, చీఫ్ సిటీ ప్లానర్, ఎస్టేట్ ఆఫీసర్ / ఇంచార్జ్ డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ)లతో సమావేశమయ్యారు. ప్రజలకు ఎటువంటి హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున, నగర పరిధిలోని కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రమాదం కలగకుండా అవగాహన కల్పించాలని, కొండ ప్రాంతాల్లో ప్రమాదానికి గురయ్యే ఇళ్లు ఎన్నున్నాయో సంపూర్ణ సర్వే జరిపించాలని చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్‌ను ఆదేశించారు. కొండ సామర్థత తెలిపే జియాలజిస్టు టెస్టులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి ని ఆదేశించారు. ప్రమాదానికి గురయ్యే ఇళ్లలో నివసిస్తున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎస్టేట్ ఆఫీసర్, డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఇన్చార్జ్ శ్రీధర్‌లను ఆదేశించారు.

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

- వాసవీ మాత ఆలయంలో 11 రోజులు బతుకమ్మ
- ప్రత్యేక కుంకుమార్చనలు
- విశేష అలంకారాల్లో అమ్మ వార్లు



ఉత్సవాలకు ముస్తాబైన విజయదుర్గా ఆలయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలకు చిట్టినగర్‌లోని పలు అమ్మవార్ల ఆలయాలు ముస్తాబవుతున్నాయి. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, సౌమ్య థియేటర్ సమీపంలోని వాసవీ అమ్మవారి ఆలయంతో పాటు ఇతర ఆలయాల్లో విశేష అలంకారాలు, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. వాసవీ మాత మందిరంలో 11 రోజుల పాటు బతుకమ్మ వేడుకలతో పాటు అమ్మవారి విశేష అలంకారానికి తగినట్లుగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భీమన వారి పేటలోని శ్రీగంగానమ్మ వారి దేవస్థానంలో శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో 11 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో కూడా నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

సౌమ్య థియేటర్ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరంలో 11 రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ పూజ జరుగుతుందని, విశేష అలంకారాలకు అనుగుణంగా ప్రత్యేక పూజలు, సంబరం, శమీపూజ, నగరోత్సవాన్ని నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. చిట్టినగర్‌లో శ్రీ నగరాల మహాలక్ష్మీ (కొత్త అమ్మవారి) ఆలయ ప్రాంగణంలో 11 రోజుల పాటు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు తమ నృత్య ప్రతిభను ఇక్కడ ప్రదర్శిస్తారు.

నవోదయ విద్యాలయలో 11వ తరగతికి స్పాట్ అడ్మిషన్లు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 11వ తరగతి ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి.యదునందన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్ సైన్స్ గ్రూపుల్లో మిగిలిన సీట్లు కోసం స్పాట్ అడ్మిషన్లు చేపట్టామన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. 'మొదట వచ్చిన వారికి -మొదటి ప్రాధాన్యత' పద్ధతిలో ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపికై న విద్యార్థులకు రెండేళ్ల పాటు ఉచిత విద్య, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 23వ తేదీతో గడువు ముగియనున్నట్లు చెప్పారు.

గూగుల్ అంబాసిడర్లుగా వికాస్ విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులను గూగుల్ కంపెనీ తమ అంబాసిడర్లుగా ఎంపిక చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. గూగుల్ కంపెనీ మంగళవారం నిర్వహించిన క్రియేటివిటీ రౌండ్‌లో 150 మంది విద్యార్థులు పాల్గొనగా 100 మంది మౌఖిక పరీక్షకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ పరీక్ష ద్వారా నలుగురు విద్యార్థులను గూగుల్ కంపెనీ ఎంపిక చేసి, ఒప్పంద పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. ఎంపికైన ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సీహెచ్.బాల అనూష, ఎం.జోజశ్రీ, భువన శ్రీ, ఎం. తేజస్వీలను ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు, కళాశాల డైరెక్టర్ ఎన్.కీర్తి, అధ్యాపకులు అభినందించారు.

దసరా ఏర్పాట్లను పరిశీలించిన వీఎంసీ కమిషనర్



కెనాల్‌రోడ్డులో దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): దసరా శరన్నవరాత్రుల వేడుకల ఏర్పాట్లలో ఎలాంటి లోపం తలెత్తకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం కెనాల్ రోడ్, వినాయకుని గుడి, వన్‌టౌన్ ప్రాంతాల్లో జరుగుతున్న దసరా నవరాత్రుల వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చే అమ్మవారి భక్తులకు కల్పించే సౌకర్యాల్లో ఎలాంటి లోపం ఉండకూడదన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం ఏపీ పాయింట్ల వద్ద కల్పిస్తున్నారు, క్యూలైన్ల వద్ద సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, ఉచిత చెప్పుల స్టాండ్, మరుగుదొడ్ల పాయింట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కెనాల్ రోడ్ల వద్ద పాడైపోయిన ఫెన్సింగ్ గమనించి త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంసీ అత్యవసర కౌన్సిల్ నిర్వహించాలి



మేయర్ రాయన భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న వీఎంసీ సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో అతిసార వ్యాధి వలన భయాందోళన చెందుతున్న నగర ప్రజల ప్రాణాలను రక్షించటానికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించేందుకు నగర పాలక సంస్థ అత్యవసరంగా కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మేయర్ రాయన భాగ్యలక్ష్మికి విజ్ఞప్తిచేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో మంగళవారం ఆమెను కలిసిన సత్యబాబు నగరంలో 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో ప్రస్తుతం నెలకొన్న అతిసార వ్యాధి వలన ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అతిసార వ్యాధి వలన ఇప్పటికే ముగ్గురు వ్యక్తులు మరణించారని, సుమారు 300 మంది వివిధ హాస్పిటల్స్‌లో వైద్య సేవలు పొందుతూ తీవ్ర భయాందోళన చెందుతున్నారని అన్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితిని చర్చించి నగర ప్రజలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని, కావున అత్యవసరంగా కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.

కార్మికుల పనిగంటలు పెంచే బిల్లులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సత్యబాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచే కార్మిక వ్యతిరేక బిల్లును రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తిరస్కరించాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సర్కిల్ -1 గౌరవాధ్యక్షుడు బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 37వ డివిజన్ సిల్ట్ కార్మికుల గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సత్యబాబు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమ పథకాలు నిలుపుదల చేసి కార్పొరేట్ కంపెనీలకు ప్రజల సంపదను ధారాదత్తం చేయడం అన్యాయం అన్నారు. యూనియన్ నగర అధ్యక్షుడు జ్యోతిబసు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ నెల 18 నుంచి విజయవాడలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ పశ్చిమ నగర కార్యదర్శి వి.సాంబులు, యూనియన్ ప్రతినిధులు శ్రీను, దుర్గారావు, వెంకటేశ్వరావు, దానియేలు తదితరులు పాల్గొన్నారు

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

రెండు కిలోల గంజాయి స్వాధీనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల పరిసర ప్రాంతాలలో గంజాయి విక్రయిస్తున్న ఇరువురు యువకులను మంగళవారం గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటమట రామలింగేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన బత్తిన ఫణీంద్ర (22), లక్ష్మీపతి నగర్ పటమటకు చెందిన ఆకుల వినయ్ కుమార్ (23) స్నేహితులు. వీరు ఇరువురు గంజాయికి బానిస అయ్యారు. డబ్బుల కోసం రాజమండ్రి నుంచి గుర్తుతెలియని వ్యక్తి వద్ద రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి గుణదల పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలలో విక్రయిస్తున్నారు. గుణదల పోలీసులకు రాబడిన సమాచారం మేరకు సీఐ వాసిరెడ్డి శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి గంజాయి విక్రయిస్తున్న ఇరువురు యువకులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నా, సేవిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కబడ్డీలో ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సునీత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పలు విభాగాల్లో ఫార్మసీ విద్యార్థులు సత్తా చాటినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత తెలిపారు. ఈ పోటీల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని 10 కళాశాలల నుంచి 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. పోటీల్లో తమ విద్యార్థులు ఉమెన్స్ విభాగంలో కబడ్డీ, క్యారమ్స్ డబుల్, త్రోబాల్‌లో మొదటి బహుమతి, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో మొదటి, రెండో బహుమతులు పొందినట్లు తెలిపారు. మెన్స్ విభాగంలో టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో మొదటి, రెండో బహుమతులు, క్యారమ్స్‌లో రెండో బహమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపాల్ సునీత విజేతలను అభినందించారు.

తాగునీరు సురక్షితమేనా..?

- రంగు మారి వస్తున్న మున్సిపల్ వాటర్
- ఆర్‌ఓ వాటర్ లో ఫంగస్ ఉంటున్న వైనం
- వ్యాధుల బారిన ప్రజలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో ప్రజలు తాగుతున్న నీరు సురక్షితమైనదేనా.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే చర్చ. నగర పాలక సంస్థ సరఫరా చేసే నీరు రంగు మారి వస్తుండగా, ఆర్‌ఓ ప్లాంట్‌లలో కొనుగోలు చేస్తున్న నీటిలో సైతం ఫంగస్ ఉంటున్నట్లు చెబుతున్నారు. ఇటీవల న్యూ రాజరాజేశ్వరి పేటలోని 300 మందికి పైగా డయేరియా బారిన పడటానికి కలుషిత నీరే కారణమని వైద్య నిపుణులు చెపుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు తాగునీటి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కుళాయిల్లో రంగుమారిన నీరు

వాస్తవంగా కృష్ణానది నుంచి నీటిని శుద్ధి చేసి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తారు. అయితే నగరంలోని చాలా ప్రాంతాల్లో దశాబ్దాల కిందట వేసిన పైప్‌లైన్‌లే ఉన్నాయి. డ్రైనేజీల నుంచి మంచి నీటి పైప్‌లైన్‌లు వెళ్లిన ప్రాంతాలు ఉన్నాయి. గత ఏడాది మొగల్రాజపురంలో డయేరియా సోకిన సమయంలో ఇదే విషయాన్ని గుర్తించారు. ప్రస్తుతం న్యూ రాజరాజేశ్వరిపేటలో కూడా చాలా బ్లాక్‌లలో పగిలిన డ్రైనేజీ పైపుల పక్కనే మంచినీటి పైప్‌లైన్‌లు ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు.

అపరిశుభ్రంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు

నగరంలోని పలు ఓవర్‌హెడ్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉంటున్నట్లు ప్రజలు చెబుతున్నారు. వాటిని తరచూ శుభ్రం చేయాల్సి ఉన్నా, ఏదో నామమాత్రంగా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో నీరు తాగిన వారు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందంటున్నారు.

ఆర్‌ఓ వాటర్‌లో ఫంగస్

నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లు కుప్పలు తెప్పలుగా వెలిశాయి. అలాంటి ప్లాంట్‌ల నుంచి వచ్చే నీరు తాగితే వ్యాధులు సోకడం తథ్యం. కొన్ని ఆర్‌ఓ ప్లాంట్‌లలో పట్టిన నీటిని తనిఖీ చేస్తే ఫంగస్ ఉన్నట్లు గుర్తించారు. ఆ ఫంగస్ కారణంగా టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందంటున్నారు. ఆర్‌ఓ ప్లాంట్‌లు భూగర్భ జలాలను వినియోగిస్తుండటంతో అవసరమైన మినరల్స్ వాటిలో ఉండవని, అవి తాగితే ఎముకలు గుల్లబారడం తథ్యమంటున్నారు.

ఆర్‌ఓ వాటర్ అనారోగ్యకరం



నగరంలోని పలు ఆర్‌ఓ ప్లాంట్‌లు నీటిలోని గాఢతను తగ్గించి, తాగడానికి అనుకూలమైన నీటిని అందిస్తున్నాయే కానీ, వాటిలో ఎలాంటి మినరల్స్ ఉండటం లేదు. తాగునీటిలో అవసరమైన కాల్షియం, మెగ్నీషియం ఐరన్ ఉండాల్సిన అవసరం ఉంది. నైట్రేట్ శాతాన్ని తగ్గించాలి. కానీ అదేమీ జరగడం లేదు. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

– తుమ్మల శ్రీకుమార్, పర్యావరణ నిపుణుడు

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



కార్పొరేషన్ కుళాయిల నుంచి వచ్చిన నీరైనా, ఆర్‌ఓ వాటర్ అయినా బాగా మరగబెట్టి, కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఉన్న నీటిని ఎట్టి పరిస్థితుల్లో తాగకూడదు. కొందరు ఆర్‌ఓ వాటర్ కదా అని, అలా తాగేస్తున్నారు. అవి కూడా శుభ్రమైనవని చెప్పలేం. ఆర్‌ఓ ప్లాంట్‌లలో ఫిల్టర్‌లు తరచూ శుభ్రం చేయాలి. లేదంటే ఆ నీటిని తాగే వారికి వ్యాధులు సోకే అవకాశం ఉంది.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ

డెర్మటాలజీ పీజీ ప్రజెంటేషన్‌కు బహుమతి



విజేత వర్ధినిరితికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలల డెర్మటాలజీ విభాగంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న డాక్టర్ జి.వర్ధిని రితిక నోటి వ్యాధుల నిర్ధారణలో ఉపయోగించే మ్యూకోస్కోపీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనా పత్రానికి మొదటి బహుమతి లభించింది. ఈ నెల 14న విశాఖపట్నంలో జరిగిన 14వ రాష్ట్ర స్థాయి చర్మ వ్యాధుల వైద్యుల సదస్సులో డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.వాణితో పాటు, ఆరుగురు పీజీ విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలు సమర్పించారు. వారిలో జి.వర్ధినిరితిక సమర్పించిన పత్రానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు తన చాంబర్‌లో మొదటి బహుమతి పొందిన వర్ధినిరితికను ప్రత్యేకంగా అభినందించారు. ఇది సిద్ధార్థ వైద్య కళాశాలకే గర్వకారణమని ఆయన అన్నారు.